సాక్షి నిజామాబాద్
శుక్రవారం । 29 । మార్చి । 2024



రూ.కోటి దాటిన బకాయిలు

ఇందల్వాయి, నల్లవెల్లి సొసైటీల్లో మొండి బకాయిలు రూ.కోటి దాటాయి. దీంతో సంఘాలు నష్టపోతున్నాయి.

- 10లో ▸





వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇద్దరు ఇన్విజిలేటర్ల తొలగింపు

నిజామాబాద్‌అర్బన్ : పదో తరగతి పరీక్షల్లో గురువారం ఇద్దరు ఇన్విజిలేటర్లను తొలగించారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్, జక్రాన్‌పల్లి పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న జె సుందర్, జె సంజీవ్‌కుమార్‌ను తొలగించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. విధుల్లో నిర్లక్ష్య వైఖరితో తొలగించినట్లు పేర్కొన్నారు. కాగా గురువారం జరిగిన పరీక్షకు 22,024 విద్యార్థులకు 21,976 మంది పరీక్షలు రాశారు. డీఈవో ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

పశువులను కాపాడుకోవాలి



ధర్పల్లి : పాడి రైతులు తమ పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి సూచించారు. ధర్పల్లి మండలంలోని దుబ్బాకలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేసే కార్యక్రమాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. పశువులకు ఏ చిన్న సమస్య తలెత్తినా వైద్యులను సంప్రదించాలని సూచించారు. సహాయ సంచాలకులు బాలిక్ అహ్మద్, మండల పశు వైద్యాధికారి గంగప్రసాద్, సిబ్బంది శివకుమార్, సుభాష్, మహిపాల్, సర్దార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా ఏడు వేల క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, గుత్ప లిఫ్టు ద్వారా 146 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్టు ద్వారా 347 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ముంపు గ్రామాల లిఫ్టులకు 200 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 432 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 1062(16 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

అడ్మినిస్ట్రేటివ్ జడ్జీల నియామకం


శ్రీసుధ


శ్రీనివాస్‌రావు

ఖలీల్‌వాడి : ఉమ్మడి జిల్లా కోర్టులకు అడ్మినిస్ట్రేటివ్ జడ్జీలను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు న్యాయమూర్తులు శ్రీసుధ నిజామాబాద్‌కు, శ్రీనివాసరావు కామారెడ్డికి నియమితులయ్యారు. జస్టిస్ శ్రీసుధ గతంలో ఉమ్మడి జిల్లా అదనపు జిల్లా జడ్జిగా, జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు. వీరు జిల్లాలోని న్యాయాధికారులతో సమావేశాలు నిర్వహించి సివిల్, క్రిమినల్ కేసులను సత్వరమే పరిష్కరించడానికి సూచనలు చేస్తారు.

ఎస్సారెస్పీని సందర్శించిన ట్రైయినీ ఐఏఎస్



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను గురువారం ట్రైయినీ ఐఏఎస్ కిరణ్మయి సందర్శించారు. ప్రాజెక్ట్ ఆయకట్టు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్ట్ దిగువన ఉన్న జాతీయ చేప పిల్లల కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్సారెస్పీ ఈఈ చక్రపాని, ఫిషరీష్ డెవలప్‌మెంట్ అధికారి లాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్దండుల మధ్య పోరు

పార్లమెంట్ ఎన్నికల్లో తలపడనున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ముగ్గురూ ఘటికులేనని పేరుంది. పసుపు బోర్డు ప్రకటన, ప్రధాని నరేంద్ర మోదీ ఇమేజ్ సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి అర్వింద్‌కు కలిసొచ్చే అంశాలు.. ఇక కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డికి ఆరు సార్లు, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు నాలుగుసార్లు ఎమ్మెల్యేలుగా పనిచేసిన అనుభవం ఉంది.



- రసవత్తరంగా మారనున్న ఇందూరు పార్లమెంట్ ఎన్నిక
- అసెంబ్లీ ఎన్నికల్లో ముగ్గురికీ తప్పని ఓటమి
- గత ఎన్నికల్లో కేసీఆర్ తనయ కవితను ఓడించిన బీజేపీ అభ్యర్థి అర్వింద్
- ఆరు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఆర్టీసీ చైర్మన్‌గా పనిచేసిన బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రధాన పార్టీల తరఫున నిజామాబాద్ లోక్‌సభ బరిలో తలపడనున్న అభ్యర్థుల ఖరారు పూర్తయింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తరఫున సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, నాలుగు నెలల కిందట రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ తరఫున సీనియర్ నేత బాజిరెడ్డి గోవర్ధన్ పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ ముగ్గురు ప్రత్యర్థులకు ఒక ప్రత్యేకత ఉంది. పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి గత శాసనసభ ఎన్నికల్లో జగిత్యాల నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థిపై ఓడిపోయారు. సిట్టింగ్ ఎంపీ అర్వింద్ కోరుట్ల నుంచి బరిలోకి దిగి బీఆర్ఎస్‌పై ఓడిపోయారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా బరిలోకి దిగిన బాజిరెడ్డి గోవర్ధన్ కాంగ్రెస్ అభ్యర్థిపై ఓటమి చెందారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని మూడు వేరువేరు సెగ్మెంట్ల నుంచి ఆయా పార్టీల తరఫున బరిలోకి దిగి ఎమ్మెల్యేలుగా ఓటమి చెందిన వీరు ముగ్గురూ ఎంపీగా ఈ ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

2019లో రాజకీయ అరంగేట్రం చేసిన అర్వింద్ మొదటి ప్రయత్నంలోనే కేసీఆర్ కుమార్తె కవితపై విజయం సాధించి పార్లమెంట్‌లోకి అడుగుపెట్టారు. ఇక సీనియర్ నేత జీవన్‌రెడ్డి ఇప్పటివరకు ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి పలుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. మరో సీనియర్ నేత బాజిరెడ్డి గోవర్ధన్ సైతం ఇప్పటివరకు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఆర్టీసీ చైర్మన్‌గానూ పనిచేశారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురి మధ్య గట్టి త్రిముఖ పోరు జరుగనుంది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు..

సెగ్మెంట్	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
నిజామాబాద్ అర్బన్	59,853	44,829	75,240
నిజామాబాద్ రూరల్	78,378	56,415	49,723
ఆర్మూర్	42,989	39,395	72,658
బాల్కొండ	65,884	70,417	30,250
బోధన్	66,963	63,901	33,555
కోరుట్ల	39,647	72,115	61,810
జగిత్యాల	54,421	70,243	42,138
మొత్తం	4,08,135	4,17,315	3,65,374

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో మూడు చోట్ల (జగిత్యాల, కోరుట్ల, బాల్కొండ) బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రెండు చోట్ల (నిజామాబాద్ రూరల్, బోధన్) కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరో రెండు నియోజకవర్గాల్లో (నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్) బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పసుపు బోర్డు మంజూరు ప్రకటన, ప్రధాని నరేంద్ర మోదీ ఇమేజ్ భారీగా ఉన్న నేపథ్యంలో సిట్టింగ్ ఎంపీ అర్వింద్ ఇప్పటికే అన్ని సెగ్మెంట్లలో సమావేశాలతో దూసుకుపోతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సైతం కొన్ని సెగ్మెంట్లలో సమావేశాలు నిర్వహించారు. తాజాగా కాంగ్రెస్ జీవన్‌రెడ్డి అభ్యర్థిని ఖరారు చేయడంతో ఆయన కూడా ప్రచార ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో నాలుగు నెలల క్రితమే అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ శ్రేణులు జోష్‌మీదున్నాయి.

జాతీయ అంశాలు.. సామాజిక సమీకరణలు..

జాతీయ స్థాయి అంశాలు ప్రభావితం చేయనున్న ఈ ఎన్నికలకు సంబంధించి సామాజిక సమీకరణలు సైతం కీలక పాత్ర పోషించనున్నాయి. విలక్షణమైన తీర్పును ఇచ్చే ఈ స్థానంలో ఓటర్ల నాడి ప్రత్యేకంగా ఉంటుంది. ఏడు సెగ్మెంట్లకు గాను రెండు చోట్ల బీజేపీ, రెండు చోట్ల కాంగ్రెస్, మూడు చోట్ల బీఆర్ఎస్ గెలుపొందాయి. అయితే మారిన సమీకరణల నేపథ్యంలో సోషల్ ఇంజినీరింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. ముస్లిం మైనారిటీ, మున్నూరుకాపు, పద్మశాలి సామాజిక వర్గాల ఓట్లు బాగా ప్రభావితం చేయనున్నాయి. అదేవిధంగా గల్ఫ్ వలస కార్మిక కుటుంబాల ఓట్లు, పసుపు రైతుల ఓట్లు సైతం ఫలితాలను శాసించే స్థితిలోనే ఉండడం గమనార్హం. ఇక బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు మున్నూరుకాపు కులానికి చెందినవారు కాగా, కాంగ్రెస్ అభ్యర్థి రెడ్డి కులానికి చెందినవారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో శాసనసభ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల ఆలోచనా సరళిలో భారీగా మార్పులు వచ్చాయి. ఈ నేపథ్యంలో పోరు ఆసక్తికరంగా మారనుంది.

ఆక్రమణల తొలగింపు

రామర్తి చెరువు ప్రక్షాళనకు రంగంలోకి దిగిన యంత్రాంగం


రామర్తి చెరువులో జేసీబీలతో ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ నగరంలోని బోధన్ రోడ్డులో ఉన్న అర్సపల్లి రామర్తి చెరువు ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. 32 ఎకరాల మేర ఉన్న ఈ చెరువు ప్రస్తుతం 6 ఎకరాలకు కుచించుకుపోయింది. కొందరు ప్రజాప్రతినిధుల కబ్జాల కారణంగానే ఈ దుస్థితి నెలకొందంటూ గురువారం 'సాక్షి'లో 'చెరువులకు ఎసరు!' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు ఆక్రమణల తొలగింపు కోసం చర్యలకు ఉపక్రమించారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీసు అధికారులు జేసీబీలను తీసుకెళ్లి అక్రమ కట్టడాలను కూల్చేసే పనిని మొదలుపెట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. ఈ విషయమై ఆర్డీవో రాజేంద్రకుమార్ మాట్లాడుతూ ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. చెరువు స్థలంలో నిర్మించిన భవనాలను కూల్చేస్తామన్నారు. చెరువు మొత్తాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకుని పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. ఆక్రమణలకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.



రూ.50 వేలకు మించితే ఆధారాలు చూపాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : పార్లమెంట్ ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో జిల్లాలో పోలీస్, ఎస్‌టీ, ఎఫ్ఎస్ టీమ్స్ తనిఖీలు నిర్వహిస్తున్నాయని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటనను విడుదల చేశారు. తనిఖీల్లో రూ.50 వేల కంటే ఎక్కువ నగదు, బంగారం, వెండి తరలిస్తే సరైన ఆధారాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆధారాలు చూపకుంటే తనిఖీ అధికారులు ఆ డబ్బు, వస్తువులను జప్తు చేస్తారని పేర్కొన్నారు. తనిఖీల్లో జప్తు చేసిన నగదు, బంగారం, వెండి వస్తువులు రూ.10 లక్షలకు లోబడి ఉండి, తగిన ఆధారాలు చూపిన పక్షంలో వాటిని విడుదల చేయడానికి జిల్లాస్థాయిలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ (డీజీసీ)ని ఏర్పాటు చేశామని తెలిపారు. కమిటీకి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చైర్మన్‌గా వ్యవహరిస్తారని, సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, జిల్లా కోశాధికారితో జిల్లా గ్రీవెన్స్ కమిటీ పని చేస్తుందని వివరించారు. రూ.10 లక్షల లోపు నగదు, బంగారం, వెండి వస్తువులకు సంబంధించిన ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీ పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటే విడుదల చేస్తుందన్నారు. రూ.10లక్షలకు మించి ఉంటే ఆదాయ పన్ను నోడల్ అధికారికి పంపుతుందని తెలిపారు.

మూడు కేసులు నమోదు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత జిల్లాలో ఇప్పటివరకు మూడు కేసులు నమోదైనట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో ఒక కేసులో రూ.50 వేల నగదుకు సంబంధించి తగిన ఆధారాలు చూపించడంతో డీజీసీ ఆ మొత్తాన్ని విడుదల చేసిందన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున రూ.50వేల నగదు కంటే ఎక్కువ డబ్బులు, బంగారం, వెండి వస్తువులతో ప్రయాణించొద్దని సూచించారు. నగదు, వస్తువులను జప్తు చేస్తే ఆందోళన చెందకుండా సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా గ్రీవెన్స్ కమిటీ నోడల్ అధికారి పల్లె పాపయ్య (7997590472)ను సంప్రదించాలని సూచించారు.

వరి కోతలు షురూ..!

- చేతికొచ్చిన సన్నరకాలు
- ధాన్యాన్ని ఆరబోసి కల్లాలకు తరలిస్తున్న రైతులు
- కోత యంత్రాలకు పెరిగిన గిరాకీ


డొంకేశ్వర్ మండలం తొండాకూర్ వద్ద వరి పంటను కోస్తున్న హార్వెస్టర్

డొంకేశ్వర్(ఆర్మూర్): యాసంగి సీజన్‌లో సాగైన వరి పంట దాదాపు చేతికొచ్చింది. దీంతో రైతులు కోతలను ప్రారంభించారు. ఇప్పటికే బోధన్ నియోజకవర్గంలో కోతలు జోరందుకున్నాయి. వడగళ్ల భయానికి నిజామాబాద్ రూరల్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో కూడా కోతలను వేగవంతం చేశారు. దీంతో వరికోత యంత్రాలకు గిరాకీ పెరిగింది. జిల్లా లో యాసంగికి 3,95,871 ఎకరాల్లో వరిపంట సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. రైతులు అంచనాకు మించి 4,13,485 ఎకరాల్లో సాగుచేశారు. ఇప్పటికే యాభై శాతానికి పైగా పంట కోత దశకు వచ్చింది. బోధన్ ప్రాంతంలో పచ్చిధాన్యాన్ని మద్దతు ధరకు మించి బయట రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు రూ. 2,200 దాకా ఇవ్వడంతో అక్కడి రైతులు వ్యాపారులకే ధాన్యాన్ని ఇచ్చేందుకు మొగ్గుచూపుతున్నారు. ఇటు ఏప్రిల్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలను తెరవనుండడంతో జిల్లాలో రైతులు పంట కోతలను వేగవంతం చేశారు. దీంతో కోత యంత్రాలకు గిరాకీ పెరిగింది. గ్రామాలకు వచ్చి చేరుకున్న యంత్రాలను రైతులు ముందస్తుగానే మాట్లాడి పెడుతున్నారు. వాహన యజమానులు పంటను కోసినందుకు గాను గంటకు రూ. 2వేల వరకు తీసుకుంటున్నారు. భూమి పచ్చిగా ఉంటే చైన్‌తో నడిచే యంత్రానికి గంటకు రూ. 2,400 దాకా రైతులు చెల్లిస్తున్నారు.

సన్నాలే ఎక్కువ..


జిల్లా వ్యాప్తంగా 4.13 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఈసారి రైతులు సన్నరకాలను ఎక్కువగా సాగు చేశారు. గంగాకావేరి, ఆర్ఎన్ఆర్ లాంటి వరిని సాగుచేశారు. దొడ్డు రకాలతో పోలిస్తే సన్నాలు త్వరగా చేతికొస్తాయి. ప్రస్తుతం సన్నరకాల కోతలు జరుగుతున్నాయి. దొడ్డు రకాలు రెండు, మూడు వారాల్లో కోతకు రానున్నాయి. కోసిన పంటను రైతులు వెనువెంటనే కల్లాలకు తరలించి ఆరబోస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు సన్నాలకు క్వింటాలుకు రూ. 2,300 చెల్లిస్తామని బైబ్యాక్ ఒప్పందాలు చేసుకున్నారు. దీంతో రైతులు మంచి ధరను పొందనున్నారు. మరోపక్క ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరవగానే విక్రయించడానికి రైతులు వడ్లలో తేమ శాతం ఎక్కువ లేకుండా చూస్తున్నారు. ఒకవేళ అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తగా టార్పాలిన్లు కూడా సిద్ధంగా పెట్టుకున్నారు.

డిచ్‌పల్లి @ 42 డిగ్రీలు

- ఈ సీజన్‌లోనే అత్యధికం
- ఎండదెబ్బకు జనం విలవిల
- ఉక్కపోతతో పెరిగిన విద్యుత్ వినియోగం

సుభాష్‌నగర్ : జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. డిచ్‌పల్లిలో ఈ వేసవిలోనే అత్యధికంగా గురువారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మోపాల్‌లో 41.9, ఎడపల్లి 41.8, బోధన్ 41.4, కోటగిరిలో 41.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు మండుతుండటంతో అత్యవసరం అయితేనే మధ్యాహ్నం పూట బయటికి వెళ్లాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మరో రెండ్రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు. మరోవైపు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఏసీలు, కూలర్లు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరిగిందని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మార్చి చివరి వారంలోనే 42 డిగ్రీలకు చేరుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఏప్రిల్ చివరి వారం, మే నెలలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు చేరుకోగా, అత్యధికంగా నగటున 45 నుంచి 46 డిగ్రీలు నమోదయ్యాయి. కానీ ఈసారి మార్చిలోనే 40 డిగ్రీలకు మించి నమోదు కావడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అరుణవర్ణ శోభితం



గోదావరి తీరాన ఉదయిస్తున్న సూర్యుడు తన కిరణాలతో ఆకాశాన్ని అరుణ వర్ణమయం చేశాడు. ఆ కిరణాలతో గోదావరి సైతం ఎరుపు రంగులో మెరుస్తూ ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ డొంకేశ్వర్ వద్ద 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

క్లుప్తంగా

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి



భీమ్‌గల్: నరేంద్ర మోదీ మళ్లీ ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, బూత్ స్థాయిలో కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే బీజేపీ భారీ మెజార్టీతో గెలుస్తుందని ఎంపీ అర్వింద్ అన్నారు. మండలంలోని పురాణీపేట్‌లో గురువారం భీమ్‌గల్ టౌన్, భీమ్‌గల్ రూరల్, వేల్పూర్, మోర్తాడ్ మండలాల కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించగా, అర్వింద్ హాజరై మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. మోసం చేసి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



రుద్రూర్: బీజేపీ ఎంపీ అభ్యర్థిగా జహీరాబాద్ నుంచి పోటీ చేస్తున్న తనను మరో సారి ఆశీర్వదించాలని సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ కోరారు. రుద్రూర్, వర్ని మండల కేంద్రాల్లో గురువారం నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మోదీ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కామారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు అరుణతార మాట్లాడుతూ.. బీజేపీ గాలి వీస్తోందని,మోదీని మరోసారి ప్రధానిగా చూసేందుకు ప్రజలు ఆసక్తిగా ఉన్నారన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ప్రతి ఓటరును కలిసి బీజేపీ లక్ష్యాలను వివరిస్తే భారీ విజయం ఖాయమన్నారు.పొతంగల్,కోటగిరి,రుద్రూర్, వర్ని మండలాల కార్యకర్తలు హాజరయ్యారు. బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి యెండల లక్ష్మీనారాయణ,నిజామాబాద్ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు దొరబాబు, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు శంకర్, అనిల్,హరికృష్ణ, ప్రకాశ్ పటేల్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: పాలిసెట్ ప్రవేశ పరీక్షకు అర్హులు ఏప్రిల్ 22వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాంకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రూ.100 అపరాధ రుసుముతో ఏప్రిల్ 24వరకు, తత్కాల్ ఫీజు రూ.300 చెల్లించి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చెల్లించవచ్చని, మే 24న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

రాధాకృష్ణకు డాక్టరేట్



నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ, న్యాయ కళాశాల పరిశోధన విద్యార్థి ఎం.రాధాకృష్ణ చౌహాన్ డాక్టరేట్ పొందారు. న్యాయ నిర్వహణలో సాంకేతికతకు సంబంధించిన చట్టాలు' అనే అంశంపై డాక్టర్ శివకుమార్ పర్యవేక్షణలో ఆయన పరిశోధక గ్రంథాన్ని సమర్పించారు. గురువారం జరిగిన వైవా –ఓస్ కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. రాధాకృష్ణ చౌహాన్ సంగారెడ్డి సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపాల్ ప్రసన్న రాణి, ప్రొఫెసర్ శ్రీనివాస్, డీన్ న్యాయ కళాశాల స్రవంతి, కనకయ్య పాల్గొన్నారు.

రూ.కోటి దాటిన మొండి బకాయిలు

- నష్టాలు చవిచూస్తున్న ఇందల్వాయి, నల్లవెల్ల సహకార సంఘాలు
- అధికారుల చర్యలు అంతంత మాత్రమే



ఇందల్వాయి వ్యవసాయ సహకార సంఘం

ఇందల్వాయి: మండలంలోని ఇందల్వాయి, నల్లవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో మొండి బకాయిలు రూ.కోటి దాటాయి. సభ్యుల వాటాధనం, ఎరువులు, విత్తనాల విక్రయం, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సంఘానికి సమకూరిన ఆదాయాన్ని దీర్ఘకాలిక రుణాలుగా పొందిన కొందరు రైతులు వాటిని ఏళ్ల తరబడి సకాలంలో చెల్లించకపోవడంతో సహకార సంఘాలు తీవ్రంగా నష్టపోతున్నాయి.

మొండిగా వ్యవహరిస్తున్న బకాయిదారులు

నల్లవెల్లి సహకార సంఘంలో సుమారు 20 మంది రైతుల నుంచి రూ.60 లక్షలు, ఇందల్వాయి సహకార సంఘంలో 30 మంది రైతుల నుంచి సుమారు రూ.70 లక్షలు రావాల్సి ఉంది. రుణాలు తీసుకున్న వారు సకాలంలో తిరిగి చెల్లించకపోతే అధికారులు నోటీసులు జారీ చేయడంతోపాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అధికారులు ఇవేవీ పట్టించుకోకపోవడంతో బకాయిదారులు మొండిగా వ్యవహరిస్తున్నారు. ప్రజాప్రతినిధుల అండతోనే రుణగ్రహీతలు తాము తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనితోడు పలువురు చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకొని రుణాలు తిరిగి చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. దీర్ఘకాలిక రుణాలను డీసీసీబీకి సహకార సంఘాలు సొంత నిధులను సకాలంలో చెల్లిస్తున్నాయి. దీంతో స్థానిక సహకార సంఘాలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇతర రైతులకు, కొత్త వారికి పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు అందించడంలో విఫలమవుతూ వెనుకబడిపోతున్నాయి. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు మొండి బకాయిలపై దృష్టి సారించాలని ఆయా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ఓటీఎస్‌ను వినియోగించుకోవాలి

రుణాలు చెల్లించని రైతులకు సహకార సంఘాల లీగల్ ఆక్షన్ సిబ్బంది సెక్షన్ 71 ప్రకారం బ్యాంకు డీఆర్‌వోఎస్ దగ్గర నోటీస్ ఫైల్ చేసి అప్లికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం డిఫాల్టర్లకు మొదట నోటీసులు జారీ చేసి వసూలు చేసే కార్యక్రమం ప్రారంభిస్తాం. అయినప్పటికీ చెల్లించకపోతే మార్ట్‌గేజ్‌లో ఉన్న స్థిర, చరాస్తులను వేలం వేసి రుణాలను రికవరీ చేసే అవకాశాలున్నాయి. ఇప్పటికే వడ్డీ మాఫీతో కూడిన వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ కూడా అమలు చేస్తున్నాం. మార్చి 31 వరకు మొండి బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– నమిల శ్రీనివాస్‌రావు, డీసీవో, నిజామాబాద్

నోటీసులు అందజేస్తున్నాం

బకాయిలు చెల్లించని రుణగ్రస్తులకు నిబంధనల ప్రకారం నోటీసులు అందజేస్తున్నాం. వన్ టైమ్ సెటిల్‌మెంట్(ఓటీఎస్) పథకం గురించి వివరిస్తున్నాం. మొండి బకాయిలు వసూలయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. సహకార సంఘాల సేవలు రైతులకు పూర్తి స్థాయిలో అందించేందుకు సభ్యులందరు సకాలంలో రుణాలు చెల్లించేలా ప్రోత్సహిస్తున్నాం.

– రతన్, సీఈవో,పీఏసీఎస్, ఇందల్వాయి

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన ఇందూరు తిరుమల
- ఏప్రిల్ 2న శ్రీవారి కల్యాణమహోత్సవం



విద్యుత్ దీపాలకాంతిలో ఆలయ ముఖద్వారం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమై ఏప్రిల్ 5వరకు కొనసాగనున్నాయి. ప్రతి ఏడాది నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఏప్రిల్ 2న స్వామి వారి కల్యాణోత్సవం, ఉత్సవ మూర్తులతో పురవీధుల్లో గరుడ వాహన సేవ నిర్వహించనున్నారు. 5వ తేదీన బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. మా పల్లె చారిటబుల్ ట్రస్ట్, ఆలయ ప్రధాన ధర్మకర్తలు ప్రముఖ నిర్మాత దిల్ రాజు, శిరీశ్, నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, హరీశ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. నిత్యం సినిమా షెడ్యూల్ బిజీగా ఉండే దిల్ రాజు, తన కుటుంబ సభ్యులతో బ్రహ్మోత్సవాల సందర్భంగా వారం రోజులపాటు స్వామి వారి సన్నిధిలో సేవ చేసుకుంటారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ ప్రధాన ధర్మకర్తలు పేర్కొన్నారు. భక్తులు సపరివార సమేతంగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

క్షయ రహిత జిల్లాగా మార్చాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్‌నాగారం: టీబీ నిర్మూలన కోసం సంబంధిత విభాగం సిబ్బంది అందించిన సేవలకు నిజామాబాద్ జిల్లాకు జాతీయ స్థాయి అవార్డులు దక్కడం సంతోషకరమని, జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. క్షయ నియంత్రణ విభాగం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో గురువారం ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించింది. కార్యక్రమానికి హాజరైన డీఎంహెచ్‌వో సుదర్శనం మాట్లాడుతూ.. క్షయ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నామన్నారు. టీబీ లక్షణాలు, చికిత్సపై జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌ల వైద్యాధికారులు, టీబీ నోడల్ పర్సన్స్, ఆశ కార్యకర్తలతోపాటు టీబీ బారినపడి పూర్తిగా కోలుకున్న వారిని అతిథులు సన్మానించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ విద్య, ఐఎంఏ ప్రెసిడెంట్ దామోదర్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ శ్రీశైలం, డాక్టర్ డీఎల్‌ఎన్ స్వామి, పీవోడీటీ డాక్టర్ నాగరాజ్, డీఐవో డాక్టర్ అశోక్, ప్రైవేట్ పల్మనాలజిస్ట్ రాజేశ్వర్, ఉదయ్‌కృష్ణ, ఆశ కార్యకర్తలు, స్వచ్ఛ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

- జీజీహెచ్‌లో రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు కాంగ్రెస్ వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఖైసర్

సుభాష్‌నగర్: జిల్లా జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని, పేదలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం, పర్యవేక్షణ, పరిశుభ్రత లోపించిందని కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ సయ్యద్ ఖైసర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ ఖైసర్ మాట్లాడుతూ.. జీజీహెచ్‌లో ఉన్నకొద్ది మంది వైద్యులు సమయానికి రావడం లేదన్నారు. పేషెంట్లను పలువురు ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తూ కమీషన్లు పొందుతున్నారని ఆరోపించారు. స్కానింగ్, ఎక్స్ రే, ఇతర పరికరాలు టెక్నీషియన్లు లేక మూలన పడ్డాయని, ఈ అంశాన్ని పలుమార్లు సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి జీజీహెచ్‌లో నెలకొన్న వాస్తవ పరిస్థితిని వివరించానని కలెక్టర్‌కు తెలిపారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. త్వరలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు సయ్యద్ ఖైసర్ తెలిపారు. ఆయనవెంట కాంగ్రెస్ నగర ప్రధానకార్యదర్శి నరేందర్‌సింగ్ ఉన్నారు.

ఇద్దరికి రిలీవింగ్ ఆర్డర్స్

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: 'ప్రమోషన్ వచ్చినా రిలీవ్ చేయరట..!' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లాలో ఇద్దరు స్టాఫ్ నర్సులకు పదోన్నతి లభించినా వారిని అధికారులు రిలీవ్ చేయకపోవడం, ఆదిలాబాద్ నుంచి వచ్చిన మరొకరిని విధుల్లో చేర్చుకోకపోవడంతో వారు ఆందోళనకు గురయ్యారు. దీనిపై డైరెక్టర్ ఆఫ్ హెల్త్(డీహెచ్) స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని డీఎంహెచ్‌వోపై మండిపడినట్లు తెలిసింది. ఎలక్షన్ కోడ్‌కు ముందే పదోన్నతులు, బదిలీకి సంబంధించిన ఉత్తర్వులు వెలువడినప్పటికీ ఎందుకు ఆలస్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో పదోన్నతి పొందిన వారికి గురువారం సాయంత్రం రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వడంతోపాటు బదిలీపై వచ్చిన స్టాఫ్ నర్సును జాయిన్ చేసుకున్నారు.

రూ.2లక్షల కోసం అంత్యక్రియలకు అడ్డంకి

- తల్వార్‌తో మృతురాలి బంధువులపై దాడి
- రామారెడ్డి మండలం ఇసన్నపల్లిలో ఘటన



ఇంటి వాకిట్లో కృష్ణవ్వ మృతదేహం



తల్వార్‌తో దాడి చేస్తున్న రవీందర్

రామారెడ్డి: అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధురాలి అంత్యక్రియలను నిర్వహించకుండా ఆమె మరిది కొడుకు అడ్డుకున్నాడు. రూ.2లక్షలు ఇస్తేనే అంత్యక్రియలకు ఒప్పుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మృతురాలి బంధువులపై తల్వార్‌తో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఇసన్నపల్లిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చింతల కృష్ణవ్వ(55) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందింది. కృష్ణవ్వకు సంతానం లేకపోవడంతో ఆమె భర్త, బంధువులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో మృతురాలి మరిది చింతల మైసయ్యతోపాటు ఆయన భార్య, కొడుకు ఆస్తి విషయంలో కృష్ణవ్వ భర్తతోపాటు బంధువులతో గొడవపడ్డారు. రూ.2లక్షలు ఇస్తేనే అంత్యక్రియలు నిర్వహించేందుకు ఒప్పుకుంటామన్నారు. ఈ క్రమంలో మైసయ్య కొడుకు రవీందర్ ఇంట్లో నుంచి తల్వార్ తీసుకుని వచ్చి మృతురాలి చెల్లె కొడుకైన రాజంపేట మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన అప్పరబోయిన నర్సింలుపై దాడి చేశాడు. ఈ ఘటనలో నర్సింలు ఎడమచేతికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపుచేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరకు గురువారం రాత్రి పోలీసుల పర్యవేక్షణలోనే కృష్ణవ్వ అంత్యక్రియలను పూర్తి చేశారు.

క్రైం కార్నర్

కర్ణాటకలో దంపతుల ఆత్మహత్య



రాజు (ఫైల్)



స్వాతి(ఫైల్)

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని గాయత్రి నగర్‌కు చెందిన దంపతులు మేడవరపు రాజు (55), మేడవరపు స్వాతి (54) కర్ణాటక రాష్ట్రం కోడగు జిల్లా సోమార్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక లాడ్జిలో గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల వద్ద లభించిన ఆధార్ కార్డుల ఆధారంగా అక్కడి పోలీసులు నిజామాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. దంపతులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని నగరంలోని 4వ టౌన్ సీఐ నరహరి పేర్కొన్నారు. మృతులు ఎనిమిదేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వలస వచ్చారని, వారి కి సంతానం లేదన్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలి యా ల్సి ఉందన్నారు. మృతుల దూరపు బంధువును కర్ణాటక రాష్ట్రానికి పంపినట్లు సీఐ తెలిపారు.

ప్రేమికుల ఆత్మహత్య ఘటనలో మృతుడి గుర్తింపు



సూర ప్రవీణ్(ఫైల్)

ఖలీల్‌వాడి: నిర్మల్ జిల్లా బాసర రైల్వే స్టేషన్‌లో బుధవారం రాత్రి రైలుకిందపడి ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడిన విష యం తెలిసిందే. యువతిని నగరంలోని సీతారాం నగర్ కాలనీకి చెందిన నందిత(20)గా ఘటనాస్థలంలోనే గుర్తించగా, యువకుడి వివరాలు తెలియరాలేదు. విచారణ చేపట్టిన పోలీసులు మృతి చెందిన యువకుడిని నగరంలోని కోటగల్లీకి చెందిన సూరం ప్రవీణ్(28)గా గుర్తించారు. పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రెంజల్(బోధన్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బోధన్ మండలం సిద్ధాపూర్ నుంచి రెంజల్‌కు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం సాయంత్రం పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్‌తోపాటు ఓనర్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ఢీకొని ఆశ వర్కర్ మృతి



అబ్బవ్వ(ఫైల్)

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆశ వర్కర్ మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలో ఉదయం 11గంటలకు ఆశ వర్కర్ అబ్బవ్వ(41) రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో అబ్బవ్వ తలకు తీవ్రగాయాలుకాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

పరిస్థితి విషమించి వృద్ధురాలు..

నవీపేట: మండల కేంద్రానికి చెందిన శివరాశి చంద్రకళ(65) వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా, పరిస్థితి విషమించి గురువారం మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

మండలంలోని నందిగామ నుంచి యంచకు వచ్చిన చంద్రకళ ఆటో దిగుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందిందన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



భూమయ్య

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం లింగాయిపల్లికి చెందిన తొట్టు భూమయ్య(70)అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు గురువారం తెలిపారు. ఈ నెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లిన భూమయ్య ఇంటికి తిరిగిరాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భూమయ్య కూతురు మమత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

దేవునిపల్లికి చెందిన వ్యక్తి..



సంజయ్

కామారెడ్డి క్రైం: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన దేవల సంజయ్ అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన సంజయ్ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. సంజయ్ ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య శ్రీలత పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నా మని ఎస్‌హెచ్‌వో తెలిపారు.ఇటీవల ఇంటిని నిర్మించిన సంజయ్‌కు అప్పులు పెరిగినట్లు తెలిసింది.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని నాల్గోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక్ నగర్ లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆదేశాల మేరకు సీఐ అంజయ్య సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఎనిమిది మంది పట్టుబడగా, వారి వద్ద నుంచి రూ.56వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ప్రస్తుతం పోలీసులకు పట్టుబడిన పేకాటరాయుళ్ల గతంలో కూడా పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం. పేకాటస్థావరాన్ని ఇద్దరు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. దాడిలో ట్రాస్క్‌ఫోర్స్ సిబ్బంది లక్ష్మన్న, సుదర్శన్, అనిల్, నర్సయ్య, అజాం తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్యకేసులో జీవిత ఖైదు

బోధన్: భార్య హత్య కేసులో రెంజల్ మండలం నీలా గ్రామానికి చెందిన పిల్లోల్ల దేవోజీకి జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బోధన్ కోర్టు ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్ రవికుమార్ గురువారం తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనువభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నీలా గ్రామానికి చెందిన చికెన్ వ్యాపారి దేవోజీకి మెదక్ జిల్లా నల్లవాగు గ్రామానికి చెందిన మనుబాయితో వివాహమైంది. కొన్నాళ్ల తరువాత మనస్పర్థల కారణంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. తొలి కాన్పుకోసం పుట్టింటికి వెళ్లిన మనుబాయి దేవోజీపై నారాయణఖేడ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు కోర్టులో ఉండగానే దేవోజీ రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆ తరువాత నీలాకు వచ్చిన మనుబాయి.. దేవోజీతో కొన్నాళ్లపాటు ఉండి రెండోసారి గర్భందాల్చి బాబుకు జన్మనిచ్చింది. మళ్లీ గొడవలు కావడంతో పుట్టింటికి వెళ్లిపోయిన మనుబాయి భర్తపై పోలీసు కేసు పెట్టింది. మధ్యవర్తులు రాజీ కుదర్చడంతో భర్త వద్దకు వచ్చింది. భార్యపై కోపం పెంచుకున్న దేవోజీ 2021 మే 3న చికెన్‌కొట్టే కత్తితో మనుబాయి గొంతుకోసి హత్య చేసి పోలీసులకు లొంగిపోయాడు. కోర్టులో విచారణ అనంతరం నిందితుడికి జీవితఖైదు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యాంరావు వాదనలు వినిపించారు.

పోలీసులపై దాడిచేసిన వ్యక్తుల రిమాండ్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విధుల్లో ఉన్న ఎస్సై కోనారెడ్డితోపాటు సిబ్బందిపై దాడికి పాల్పడిన దుండగులను రిమాండ్‌కు పంపినట్లు బిచ్కుంద ఎస్సై మోహన్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో మండలంలోని బేగంపూర్ చౌరస్తాలోని జాతీయ రహదారి 161పై ఎస్సై కోనారెడ్డి, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. కాస్లాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు మద్యం సేవించి పోలీసులతో గొడవకు దిగి దాడికి పాల్పడ్డారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు.

పెళ్లి వాహనం బోల్తా

- పలువురికి తీవ్రగాయాలు
- లింగంపేట మండలం లింగంపల్లి శివారులో ఘటన



బోల్తాపడిన వాహనం



ఘటనాస్థలంలో క్షతగాత్రులు

లింగంపేట(ఎల్లారెడ్డి): పెళ్లి వేడుకలకు వెళ్తున్న వాహనం అదుపుతప్పి బోల్తాపడగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన లింగంపేట మండలం లింగంపల్లి (ఖుర్దా) గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. లింగంపల్లికి చెందిన కొత్త కిషన్ కుమారుడి వివాహం గ్రామ శివారులోని జీఎస్‌ఆర్ గార్డెన్‌లో జరిగింది. పెళ్లి వేడుకలో పాల్గొనేందుకు బంధువులు టాటా ఏస్ వాహనంలో బయల్దేరారు. ఈ క్రమంలో వాహనం గ్రామశివారులో అదుపుతప్పి బోల్తాపడింది. వాహన సామర్థ్యానికన్నా ఎక్కువ మందిని ఎక్కించుకోవడంతో ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో కొత్త కిషన్, ఆదిత్య, రాములు, వర్ష, సత్యవతి, లక్ష్మి, రెడ్డిపేట గ్రామానికి చెందిన లక్ష్మి, గాంధారికి చెందిన అంజయ్య, ఊరంచ రాములు, అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన రాజేశ్వరికి తీవ్ర గాయాలు కాగా, మరి కొంత మందికి స్వల్ప గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- 24గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు
- రూ.13.31లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

బాన్సువాడ : తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. 24గంటల్లో కేసును ఛేదించిన బంగారు ఆభరణాలు, నగదును రికవరీ చేశారు. బాన్సువాడలోని తన కార్యాలయంలో డీఎస్పీ సత్యనారాయణ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం వెల్లడించారు. ఈ నెల 26న మద్నూర్‌లో మహాజన్ బాలాజీ అనే వ్యక్తి ఇంటి తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగుడు బీరువాలోని 15 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల బిస్కెట్ బంగారం, రూ.16 వేల నగదును ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో 27వ తేదీన సాయంత్రం మద్నూర్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా మద్నూర్‌కు చెందిన ఉప్పరివార్ శ్రీను అనుమానాస్పద రీతిలో చేతిలో సంచితో వెళ్తుండగా పోలీసులు విచారించారు. మద్యానికి బానిసై చిన్నచిన్న దొంగతనాలు చేస్తున్నానని, మద్నూర్‌లో సైతం తాళం వేసిన ఇంటి వద్ద వారంరోజులపాటు రెక్కీ నిర్వహించి చోరీ చేసినట్లు శ్రీను అంగీకరించాడు. మూడు నెలల కిత్రం భాగన్న మఠం హుండీలోని నగదును ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నాడు. శ్రీను దొంగిలించిన సొత్తు విలువ రూ.13.31 లక్షలు ఉంటుందని, బంగారం, నగదు రికవరీ చేశామని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన బిచ్కుంద సీఐ నరేశ్, ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది సాయిబాబాగౌడ్, సాయిలు, యాసిన్‌ను డీఎస్పీ అభినందించారు.